క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

మండపేట: మారేడుబాక సబ్ స్టేషన్ వద్ద గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక జరుగనున్నట్టు ఏడీఈ జి. తిరుమలరావు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి సత్యనారాయణ, కమిటీ సభ్యులు శ్రీనివాస్, హరిబాబు, సురేంద్రకుమార్ హాజరవుతారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం తదితర సమస్యలను వినియోగదారులు కమిటీకి లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. తొలుత ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యుత్ ఆదాపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరుగుతుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

80 శాతం వరి కోతలు పూర్తి



శివలలో వరికోత యంత్రంతో ధాన్యం సేకరిస్తున్న దృశ్యం

కె.గంగవరం: గత వారం రోజులుగా వాతావరణం అనుకూలించడంతో మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అకాల వర్షాల కారణంగా కోతలను వాయిదా వేసుకున్న రైతులు ఎండలు కాయడంతో నేల ఆరుదల ఉన్న పంట పొలాల్లోని వరిని భద్రం చేసి పనిలో పడ్డారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 80 శాతం వరి కోతలు పూర్తి చేసుకుని రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. ఒకవైపు ఎంత తీవ్రతకు కూలీలు పనులు రాకపోవడంతో యంత్రాల ద్వారా వరి కోత పనులు చేస్తున్నారు. నేల ఇంకా ఆరని పంట పొలాల రైతులు కూలీలను బుజ్జగించి కూలీ రేట్లు పెంచి మరి వరి కోత కోయిస్తున్నారు. మరో వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే మిగిలిన 20 శాతం కోతల పూర్తి చేసి ధాన్యం అమ్మకాలు పూర్తి అవుతాయని రైతులు ఆశతో ఉన్నారు. ఈ ఏడాది వరి అనుకున్నంత కన్నా ఎక్కువగా సాగు అవ్వడంతో రైతుల ఆనందం వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా కొంత వరకు ఆందోళన చెందిన ప్రస్తుతం మాత్రం ఆనందంతో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అచ్యుతాపురం పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: మండలంలోని అచ్యుతాపురం ఎంపీయూపీ పాఠశాలలో అభివృద్ధి పనులకు బుధవారం పీఎంసీ చైర్మన్ టి.విజయ్, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు శంకుస్థాపన చేశారు. 'నాడు–నేడు' పథకంలో పాఠశాలకు రూ.3.45 లక్షలు మంజూరు కాగా మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రు అమ్మన్న, వార్డు సభ్యులు బి.వీరకుమారి, ఉపాధ్యాయులు ఎం.బైరాము, ఎం.దాసురాజు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎం.రామ తులసి పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులతో ఎలాంటి నష్టం కలగదు

కాజులూరు: ఆంధ్రప్రదేశ్ పంటల సాగుదారుల చట్టం–2019 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పంటల సాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్సీ కార్డు)తో భూ యజమానులకు ఎటువంటి నష్టం కలగదని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. బుధవారం తణుకువాడలో ఆయన రైతులతో మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కేవలం 11 నెలల కాలపరిమితికి మాత్రమే కౌలురైతుకు సీసీఆర్సీ కార్డు ఇస్తారని భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కౌలు రైతులు ఈ సీసీఆర్సీ కార్డులు పొందటం ద్వారా పంటల నమోదు చేయించుకుని ధాన్యాన్ని సులభంగా విక్రయించుకోవటంతో పాటు బ్యాంకుల నుంచి పంటరుణాలు, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పొందవచ్చన్నారు. కౌలు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, శలపాక సర్పంచ్ పోతుల గనిరాజు, రైతులు వాసంశెట్టి శ్రీనివాస్, ఆదినారాయణ పాల్గొన్నారు.

జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడిగా అబుల్ అలా

మండపేట: జమాతే ఇస్లామీ హింద్ మండపేట శాఖ నూతన అధ్యక్షుడిగా అబుల్ అలా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అబుల్ అలా బాధ్యతలు స్వీకరించారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సంఘ రాష్ట్ర సలహా మండలి సభ్యులు ఎస్కే షరీఫ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

శునకాల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఆస్పత్రిలో రోజుకు మూడు నుంచి నాలుగు కేసుల నమోదు
- పాడి పశువులకు తప్పని బెడద



మండపేటలోని ఓ వీధిలో గుంపుగా సంచరిస్తున్న శునకాలు

మండపేట: మండపేట, మండలంలోని గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. దొరికిన వారిపై దొరికినట్టుగా దాడి చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పాడిపశువులకు సైతం శునకాల బెడద తప్పడం లేదు. రోజుకు మూడు నుంచి నాలుగు కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. మండపేటలో నాలుగు వేలకు పైగా కుక్కలు ఉన్నట్టు అంచనా. పరిసర గ్రామాల నుంచి శునకాలను తీసుకు వచ్చి పట్టణంలో విడిచి పెడుతుండడంతో వాటి సంఖ్య పెరిగిపోతోంది. గాంధీనగర్, సైదిల్‌పేట, రావులపేట, శ్రీనగర్, ధర్మగుండం చెరువు, పాటిమీద, గొల్లపుంత తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్క కాటుకు సంబంధించి మార్చి నెల నుంచి ఇప్పటి వరకూ మండపేట ప్రభుత్వాస్పత్రిలో 320 కేసులు నమోదయ్యాయి. ఒక్క మార్చి నెలలోనే 101 కుక్క కాటు కేసులు నమోదు కాగా ఏప్రిల్‌లో 130, మే నెలలో ఇప్పటి వరకూ 84 కేసులు నమోదయ్యాయి. వారిలో మండపేటతో పాటు సమీపంలోని ఏడిద, తాపేశ్వరం, మారేడుబాక, నేలటూరు గ్రామాల బాధితులు ఉన్నారు. కుక్కల బెడదతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తోంది. ఉదయం వాకింగ్ చేసేటపుడు వెంట పడి తరుముతున్నాయని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటార్ సైకిళ్లపై వెళ్లే వారిని కుక్కలు వెంటాడి తరుముతుండడంతో వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాలు పాలవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రెండు వారాల క్రితం స్థానిక రావులపేటలో పిచ్చికుక్క దాడిలో 10 మందికి పైగా గాయాలపాలయ్యారు.

సమస్యను పరిష్కరించాలి

న్యాయం స్థానం ఆదేశాల నేపథ్యంలో శునకాలను నిర్మూలించే వీలు లేదు. నియంత్రణ చర్యలు మాత్రమే చేపట్టాల్సి. ఈ మేరకు గత టీడీపీ కౌన్సిల్‌లో శస్త్ర చికిత్సలు చేపడుతున్నట్టు మున్సిపల్ అధికారులు ప్రకటించినప్పటికీ ఆరంభ శూరత్వంగానే మిగిలింది. శస్త్రచికిత్సల పేరిట వారం రోజులు శిబిరం నిర్వహించిన సమస్య అపరిష్కృతంగానే మిగిలింది. శునకాల బెడదను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా నిబంధనలు మేరకు శునకాల బెడదను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పాడి పశువులకు తప్పని బెడద



శునకాల దాడిలో మృతి చెందిన లేగ దూడ

పాడి పశువులకు శునకాల బెడద తప్పడం లేదు. పాడి పశువులపైనా దాడిచేసి గాయపరుస్తున్నాయని పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇవి లేగ దూడలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయి. పది రోజుల క్రితం బైపాస్ రోడ్డులోని ఒక పశువుల మకాంలో కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందింది. తాజాగా దిబ్బగరువు వంతెన సమీపంలోని పశువుల మకాంలో లేగ దూడ కుక్కల దాడిలో మృతి చెందినట్టు స్థానిక రైతులు తెలిపారు.

ఫ్రిజ్ బహూకరణ



ఎంపీడీఓ ఆఫీసుకు వాటర్ కూలింగ్ ఫ్రిజ్ అందించిన ఏఓ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: మండుతున్న వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు, కార్యాలయ సిబ్బందికి చల్లని మంచి నీరు అందించాలన్న మంచి ఉద్దేశంతో జూన్ 2న తమ 30వ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం బుధవారం రూ.15 వేలు విలువైన వాటర్ కూలింగ్ ఫ్రిజ్‌ను అందజేశారు. ఏఓ సుబ్రహ్మణ్యంను ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, పలువురు ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఎన్.షెలత్ రాజు, కార్యాలయ సిబ్బంది అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం జగన్ దృష్టికి గ్రంథాలయ సమస్యలు



సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకన్నబాబు

మండపేట: గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు దంపతులు కోరారు. మండలంలోని కేశవరంలో పద్మ, వెంకన్నబాబు మీడియాతో మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన నిధుల విడుదలకు గురువారం కొవ్వూరు విచ్చేసిన సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. గ్రంథాలయాల డిజిటలైజేషన్, హైస్పీడ్ నెట్ ఏర్పాటు, సెస్ వసూళ్లు, బుక్ డిపాజిట్ సెంటర్ నిర్వాహకుల జీతాల పెంపుదల, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ వెంటనే సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కరించి గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారని పద్మ, వెంకన్నబాబు దంపతులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం కావాలి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో భారీగా పార్టీలో చేరికలు

మండపేట: పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ద్వారా రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి పాటు పడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఏడిద గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు ఆధ్వర్యంలో వంద మందికి పైగా స్థానికులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్సీ తోట వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గతంలో టీడీపీ ఓటేసిన వారు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేసి సీఎం జగన్ రుణం తీర్చుకుంటామని చెబుతున్నారన్నారు. పార్టీలో చేరిన తాళం శ్రీను, శివ, గెద్దాడ వీరబాబు, బాదంపూడి శ్రీను, ఆయినపర్తి శివ తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ పాలన, ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులమై తాము పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, దేవగళ్ల హరి, అప్పారావు, తేజ, పాట్నూరి రాజేష్, కుమార్, అంగర వెంకటేష్, కె.సత్తిబాబు, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాటలు చెప్పేది కాదు.. చేతల ప్రభుత్వమిది

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్సీ తోట. చిత్రంలో పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఏడాదిలోనే అమలులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన యువ నేత తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులతో కలిసి ఏడిద గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని రథం సెంటర్, మద్దేవారి వీధి, గాంధీ సెంటర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు తెలుసుకుని ప్రభుత్వ పథకాలు అందుతుందీ లేనిది అడిగి తెలుసుకున్నారు. నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై అక్కడికక్కడే గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, ఇతర అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా ప్రతి ఇంటికి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, జగన్, విసుపురెడ్డి శివ, పరమట తరుణ్, వెలగల సత్యనారాయణరెడ్డి, బూరిగ జానీ, కుడిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టాభిషేకం

నలుగురు టెన్త్ టాపర్లకు సత్కారం



మెరిట్ విద్యార్థులను సత్కరిస్తున్న సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించంలో ఎప్పుడూ ముందుంటారని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు అన్నారు. మండలంలోని వెదురుపాకలో బుధవారం సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి అధ్యక్షతన పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఏఎంసీ చైర్మన్, ఎంపీపీలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎంఈఓ వై.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన సాగుతోందని, ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో 500 మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులను సత్కరించారు. పాఠశాల సీనియర్ గణిత ఉపాధ్యాయుడు సీహెచ్‌వీవీ కన్నారావు తన తండ్రి జ్ఞాపకార్థం ప్రథమ స్థానంలో నిలిచిన అమృతకు రూ. 1,500, ద్వితీయ స్థానం సాధించిన కావ్యశ్రీ రూ.1,000, తృతీయ స్థానం సాధించిన నరేష్ రూ. 600, చతుర్థ, పంచమ స్థానాల్లో నిలిచిన కీర్తి, తులసిలు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మండ వెంకట పద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి, ఉప సర్పంచ్ దంతుర్తి వెంకట సుబ్రహ్మణ్యం, పీఎంసీ చైర్మన్ చాగంటి సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్లు తాడి బుల్లివెంకటరెడ్డి, టేకుమూడి రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునీత తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలే ఆటవిడుపు కేంద్రాలు..



మండలంలోని తాళ్లపొలంలో పంట పొలంలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: వేసవి సెలవుల్లో చిన్నారుల ఆటలకు పంట పొలాలే ఆటవిడుపు కేంద్రాలయ్యాయి. వరి కోతలు పూర్తి కావడంతో పంట పొలాలు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులు పంట పొలాలనే క్రికెట్ గ్రౌండ్ చేసుకుని మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఆటలు ఆడుతున్నారు. వడగాడ్పులు తగిలేలా వాతావరణం ఉండటంతో చిన్నారులు ఎండల్లో ఆడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు.

కోతుల సంచారాన్ని నిరోధించాలి



శీల గ్రామ వీధుల్లో గృహావాసాల మధ్య సంచరిస్తున్న కోతులు

కాజులూరు: మండలంలోని శీలలో ఇటీవల కోతులు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ స్థానికులను, రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. గ్రామ వీధుల్లో అవి హల్‌చల్ చేస్తుంటే స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొబ్బరిచెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారవేయడంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామ వీధిల్లో సంచరిస్తూ ఇళ్లపై అవి పరుగులు తీస్తుండటంతో తాటాకు, పెంకుటిళ్ల పైకప్పులు జారిపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు మహిళలు, ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. కోరంగి అభయారణ్యం దగ్గర కావటంతో అక్కడి నుంచి కోతుల గుంపులు గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాలను నిరోధించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

రాయవరం: ఇంటి సరిహద్దు విషయమై మండలంలోని మాచవరంలో ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన తగాదా నేపథ్యంలో ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదులపై రాయవరం పోలీసులు పరస్పరం కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మాచవరం గ్రామానికి చెందిన పలివెల అబ్రహాం, మోర్త అబ్బులు ఈ నెల 23న సాయంత్రం ఆరు గంటల సమయంలో సరిహద్దు విషయమై గొడవ పడ్డారు. అబ్రహాం తన ఇంటి నిర్మాణానికి తెచ్చిన ఇటుక, ఇసుకను అబ్బులు సరిహద్దులో వేశారన్నారు. సదరు విషయమై ఇరువురు గొడవపడిన సమయంలో అబ్బులు అబ్రహాం బొటనవేలిని కొరికాడన్నారు. అబ్రహాం ఇటుక రాయితో అబ్బులను నుదురు మీద కొట్టాడన్నారు. ఇరువురికి రక్తపు గాయాలు కాగా, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారన్నారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ముఖ్యమంత్రికి స్వాగతం



జగనన్న విద్యాకానుక కార్యక్రమం ప్రారంభోత్సవానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి చెల్లుబోయిన వేణు, రాజ్యసభ సభ్యుడు బోస్, ఎమ్మెల్సీ కె.సూర్యనారాయణరావు ఘన స్వాగతం పలికారు.

ప్రమాదకరంగా మల్లవరం వంతెన



అప్రోచ్ లేక ప్రమాదకరంగా మారిన వంతెన

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గ్రామంలో పంట కాలువకు సుమారు ఐదేళ్ల క్రితం నాబార్డు నిధులతో నూతన వంతెన నిర్మాణం జరిగింది. అయితే అప్పట్లో నాసిరకంగా కంకర వాడడం వల్ల కొంత వరకు అప్రోచ్ పంట కాలువలోకి కొట్టుకుపోయింది. మిగిలిన సగం ఇటీవల కురిసిన వర్షాలకు పంటకాలువలోకి కొట్టుకుపోయింది. అప్రోచ్ లేకపోవడంతో వాహనాలు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ అంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు అప్రోచ్ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

వచ్చే నెల 4న కానిస్టేబుల్ పోస్టులకు రాతపరీక్ష

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు వచ్చే నెల 4న ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి(డీపీఅండ్ఏఆర్) ఎగ్జామ్ సెల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. రాత పరీక్ష కోసం పుదుచ్చేరిలో మొత్తం 9 పరీక్షా సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే 0413–2233338 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మండపేట: టీ తీసుకు వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంపై భార్య ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని తాపేశ్వరానికి చెందిన ఎస్ దుర్గాప్రసాద్ వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి మండపేటలోని అత్తవారింటికి వచ్చాడు. 22వ తేదీ తెల్లవారుజాము సమయంలో టీ తీసుకు వస్తానని చెప్పి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. చుట్టుపక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో అతని భార్య బేబీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రామచంద్రపురం: పట్టణంలోని బైపాస్‌రోడ్డును అనుకుని కొత్తూరు రోడ్డు సమీపాన పంట పొలాల్లో ఒక చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని వేలాడుతూ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి సుమారుగా 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ అడిషనల్ ఎస్సై కేపీవీఎస్ఆర్ ఆచార్యులు విలేకరులకు తెలిపారు.

మహానాడును విజయవంతం చేయాలి

మండపేట: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 27, 28 తేదీల్లో వేమగిరి వద్ద నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. 27న ప్రతినిధుల సమావేశం, 28న బహిరంగ సభ జరుగుతాయని, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి రావాలన్నారు.

ఎస్పీ రఘునాయగంకు సీడీసీ బాధ్యతల కొనసాగింపు

యానాం: ఎస్పీ స్థాయి బాధ్యతలు తీసుకున్న యానాం ఎస్పీ రఘునాయగంకు కరెంట్ డ్యూటీ చార్జిస్(సీడీసీ) కొనసాగిస్తూ బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఎస్పీ స్థాయి విధులు నిర్వహిస్తున్న రఘునాయగానికి పే అండ్ అలవెన్స్ సెస్ సైతం ఎల్జీ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా బాలచంద్రన్‌కు సిగ్మా సెక్యూరిటీ, శర్వణన్‌కు హోమ్ గార్డ్స్, భక్తవత్సలంకు నార్త్ సబ్ డివిజన్, యు.రాజశేఖరన్‌కు కమాండెంట్ పీఏపీల్లో కరెంట్ డ్యూటీ చార్జిస్‌ను కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.